క్లుప్తంగా

మురుగు సమస్యకు మోక్షం



డ్రైనేజీ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలోని రాజీవ్ కాలనీలో డ్రైనేజీ సమస్యకు మోక్షం లభించింది. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలోని ప్రధాన డ్రైనేజీలో చెత్త పేరుకుపోవటంతో మురుగు ప్రవహించేందుకు వీలు లేకుండా పోయేది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్పందించిన మున్సిపల్ యంత్రాంగం సోమవారం డ్రైనేజీ మరమ్మతు చర్యలు చేపట్టింది. డీఈఈ శ్రీనివాసరావు నేతృత్వంలో ఇంజినీరింగ్ సిబ్బంది డ్రైనేజీపై ఉన్న పలకల ను తొలగించి జేసీబీ సహాయంతో కాలువలో పేరుకుపోయిన పూడికలను తొలగించారు.

ఇళ్లపైకి దూసుకెళ్లిన ట్యాంకర్ లారీ



బొండపల్లి వద్ద ఇళ్లపైకి దూసుకు వెళ్లిన లారీ

బొండపల్లి: జాతీయ రహదారి 26కు ఆనుకొని ఉన్న ఇళ్లపైకి అదుపు తప్పి వేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ సోమవారం దూసుకెళ్లింది. ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్యాంకర్ లారీ అదుపు తప్పి బొండపల్లిలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఒక స్లాబ్ ఇంటితో పాటు పక్కనే ఉన్న పూరిళ్లపైకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న వారు భయంతో పరుగులు తీశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి రహదారి పక్కనే గల చింత చెట్టుతో పాటు ఇళ్లను ఢీకొని నిలిచిపోయింది. హైవే పెట్రోలింగ్ వాహనం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లారీని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

రెండు కేసుల నమోదు



పట్టుబడిన మద్యం సీసాలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల ఎక్సైజ్ పోలీస్‌లు గుర్ల, నెల్లిమర్ల మండలాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. కెల్ల గ్రామంలో దాడులు నిర్వహించగా సారిపల్లి లక్ష్మణ వద్ద 9 మద్యం సీసాలతో పట్టుబడినట్లు సీఐ ఎం.వెంకటరావు తెలిపారు. అలాగే నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని రెండు ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగేశ్వరరావు, హెచ్‌సీలు వి.కృష్ణ, ఎం.అప్పారావు, ఈసీలు డికె.శంకర్, కె సీతాలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల ఆందోళన



ధర్నా చేస్తున్న రైతులు

విజయనగరం ఫోర్ట్: ఎన్‌హెచ్– 516బీ పెందుర్తి నుంచి బొడ్డవర రోడ్డులో ఎస్.కోట, కొత్తవలస బైపాస్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతుల భూములకు 2013 చట్టం ప్రకారం గజాలు చొప్పన పరిహారం ఇప్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేసారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ విలువలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ విలువకు 5 నుంచి10 రెట్లు వ్యత్యాసం ఉన్నందున ప్రైవేటు మార్కెట్ వాల్యుని పరిగణనలోనికి తీసుకొని 2013 భూ సేకరణ ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. ధర్నాలో కృష్ణమూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో వైభవశ్రీ వేంకటేశ్వరస్వామి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వైభవశ్రీ వేంకటేశ్వరస్వామి

విజయనగరం టౌన్: స్థానిక కంటోన్మెంట్ అరుంధతీనగర్‌లో కొలువైన వైభవశ్రీ వేంకటేశ్వరస్వామి వారు సోమవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి, తరించారు.

ఎమ్మెల్యే నిలదీత



తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న మహిళలు

పూసపాటిరేగ : నడిపల్లి గ్రామంలో తాగునీటికి అల్లాడుతున్నామని గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే లోకం నాగమాధవిని ప్రశ్నించారు. సోమవారం మండలంలోని నడిపల్లి గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన పశువులు నీటి కుండీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను మహిళలు తెలియజేశారు. చంపావతి నదిలో ఇసుక తరలించడం వలన సముద్రపు నీరు నడిపల్లి గ్రామం శివారు వరకు చంపావతి నదిలో చొచ్చుకుపోవడంతో గ్రామంలో తాగునీటి బోరులు ఉప్పుమయంగా మారాయని తెలిపారు. గ్రామానికి శుద్ధమైన తాగునీరు అందించాలని కోరారు. గత కొన్ని వారాలుగా ఉపాధి హామీ పనులు చేస్తున్నా... వేతనాలు అందలేదని, ఆకలితో ఉపాధి హామీ పనులు చేస్తున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ వారంలో వేతనాలు అందుతాయని తెలిపారు. అనంతరం కోనాడ సమీపంలో దుర్గామల్లేశ్వర పాడి పరిశ్రమను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వర్రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పివి.మాధురి, సర్పంచ్ లంకలపల్లి గాయిత్రి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల కుటుంబ సభ్యులకు బొత్స పరామర్శ



నిర్మల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

పూసపాటిరేగ: ఇటీవల అనారోగ్యంతో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పిన్నింటి నిర్మల మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె కుటుంబ సభ్యలను మాజీ మంత్రి, శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు సోమవారం పరామర్శించారు. నిర్మల భర్త పిన్నింటి వెంకటరమణ, కుమారుడు కుమార్‌కు ధైర్యం చెప్పారు. ఆపదలో ఉన్నప్పుడు మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. పరామర్శించిన వారిలో ప్రజాప్రతినిధులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, రొంగలి కనక సింహాచలం, బర్రి చినఅప్పన్న, పిన్నింటి ఎల్లంనాయుడు, పతివాడ శ్రీనివాసరావు, రౌతు శ్రీరామ్మూర్తి, సాకివలస శ్రీను, వి.సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



బాధిత అప్పారావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

డెంకాడ: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న డెంకాడ మండలం పెదతాడివాడకు చెందిన అథ్లెట్ కోచ్ టి.అప్పారావు వైద్యసేవల కోసం మదర్ థెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ప్రతినిధులు రూ.18,500 ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు టి.ప్రసాద్ పట్నాయక్, మాలతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష కొనసాగింది. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఆదర్శ పాఠశాల యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. ప్రవేశ పరీక్షకు మొత్తం 467 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 444 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు.

భారీ విరాళం



పైడితల్లమ్మ పండగ కమిటీ సభ్యులకు రూ.5లక్షల 3వేల 100 విరాళంగా అందిస్తున్న కంది సూర్యనారాయణ దంపతులు

డెంకాడ: మండలంలోని అక్కివరం పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవానికి మాజీ జెడ్పీటీసీ సభ్యులు కంది సూర్యనారాయణ,రాజు దంపతులు రూ.5లక్షల 3వేల 100 విరాళంగా ఇచ్చినట్టు తెలిపారు. ఈ మొత్తాన్ని పండగ కమిటీ సభ్యులకు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఏపీఎం శ్రీనివాస్

డెంకాడ: రైతులు ప్రకృతి విధానంలో పండించిన పంటలు ఆరోగ్యకరమని వెలుగు ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. ఏపీసీఎన్ఎఫ్, సెర్ప్, ఎఫ్‌పీవో సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్‌ను మండల వెలుగు కార్యాలయం ఆవరణంలో సోమవారం ఏర్పాటు చేశారు. దీనిని ఏపీఎం శ్రీనివాస్ పరిశీలించారు. కొనుగోలుదారులకు కూరగాయలను అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో ఏపీఎం గురుమూర్తి, ఐసీఆర్‌పీ సభ్యులు శ్రీదేవి, ప్రభావతి, సీసీ లత తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసుల పూర్వ వైభవం కొనసాగాలి

• జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను సత్కరించిన జిల్లా పౌరవేదిక సభ్యులు

విజయనగరం గంటస్తంభం: పరిపాలనలో స్వచ్ఛత, సమర్థత, న్యాయబద్ధత, సేవాభావంతో కూడిన సేవలు ప్రజలకు అందించడానికే భారత దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలో సివిల్ సర్వీసెస్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ లాంటి వ్యవస్థను ప్రారంభించారని వారి ఆశయం మేరకు ప్రస్తుత సివిల్ సర్వీసెస్ అధికారులు పని చేయాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. సోమవారం సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను సత్కరించిన అనంతరం భీశెట్టి విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పౌర వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల తొలగింపు అన్యాయం



సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం మండలం జొన్నవలస జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగిస్తూ తహసీల్దార్ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కూర్మనాథంకి వినతిపత్రం సమర్పించామని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, సీటు నగర అధ్యక్షుడు ఎ.జగన్మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన పథకం అమల్లో లోపాలను సరి చేయాల్సిన అధికారులు స్కూల్ యాజమాన్య కమిటీలు లోపాలను సృష్టించి రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడడం అన్యాయం అన్నారు. తహసీల్దార్ ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు లక్ష్మి, స్వప్న, సత్యవతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కాలం చెల్లిన నిర్మాణాలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి



జేసీబీతో తొలగిస్తున్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రహరీ

విజయనగరం: పురాతన కట్టడాలు, కాలం చెల్లిన నిర్మాణాలు ప్రజా రక్షణ దృష్ట్యా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి ఉన్న ప్రహరీ గోడను ఆయన ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది సోమవారం తొలగించి వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో కొన్ని పురాతన భవనాలు, కాలం చెల్లిన నిర్మాణాలను గుర్తించామన్నారు. అటువంటి నిర్మాణాలను తక్షణమే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని నోటీసులు జారీ చేశామన్నారు. ఇందులో భాగంగా స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల అధికారులకు ఈ మేరకు కార్యాలయపు ప్రహరీ గోడను తొలగించాలని సూచించామన్నారు. దీంతో స్పందించిన బీఎస్ఎన్ఎల్ అధికారులు వారి సమక్షంలో తమ ప్రణాళిక సిబ్బంది జేసీబీ సహాయంతో ప్రహరీ గోడను తొలగించినట్టు తెలిపారు. ఎవరైనా పురాతన భవనాలు, కాలం చెల్లిన నిర్మాణాలు ఉన్నట్లయితే అట్టి వాటిని ప్రజా రక్షణ నిమిత్తం తొలగించుకోవాలని మరోసారి సూచిస్తున్నామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



నృత్య ప్రదర్శనలో విద్యార్థినిలు

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాలు సోమవారం వేడుకగా జరిగాయి. తొలిత ఉత్సవాలను ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ గడిచిన విద్యా సంవత్సరంలో సాధించిన విజయాలను మించి లక్ష్యంగా అధ్యాపకులు పెట్టుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన అభ్యసనం విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇస్తుందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం తెలుగు విభాగం అధిపతి గీతా రమాదేవి ఆధ్వర్యంలో రూపొందించిన 'విజయవాణి' అనే చేతి వ్రాత త్రైమాసిక పత్రికను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ ఆవిష్కరించారు. యూనివర్సిటీ స్థాయిలో రాష్ట్ర స్థాయిలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జయపాల్ రావు, అకడమిక్ కోఆర్డినేటర్ రూపవాణి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

విజయనగరం: అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు త్యాడ రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ముఖ్యఅతిథులుగా హాజరైన డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కె.మురళీధర్, రీజియన్ కౌన్సిలర్ కర్రోతు సత్యం, ఎలక్ట్ గవర్నర్ ఎ.తిరుపతి రావు, క్లబ్ గౌరవ అధ్యక్షుడు పిన్నింటి సూర్యనారాయణ, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ సంజీవరావు ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షుడు చిరంజీవి రావు, వాకర్స్ ఉద్యమకారులు నాలుగెస్సల రాజు, కె.ఎర్నాయుడు, శ్రీరామ్మూర్తి, తాడ్డి ఆదినారాయణ, ఈపు విజయకుమార్, పిడుగు సత్యనారాయణ, చిట్టి రాజు, లోపింటి కల్యాణ్, ముదిలి శ్రీనివాస్, ప్రముఖ సంఘ సేవకులు లక్ష్మీశేఖర్, త్యాడ ప్రసాద్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

• రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు



ఎస్పీ ఆదేశాలతో ఆదివారం రాత్రి పోలీసులు విజయనగరం రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు విజయనగరం వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రూరల్ సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ప్లాట్ ఫాంపై ఎటువంటి కారణాలు లేకుండా ఉన్న ప్యాసింజర్ల వివరాలు సేకరించారు. అలాగే రాత్రి 11 గంటల తరువాత రోడ్లపై తిరిగే యువతకు కౌన్సెలింగ్ చేసినట్టు సీఐ తెలిపారు. - విజయనగరం క్రైం

• అంగన్‌వాడీల అవగాహన ర్యాలీ



గర్భిణుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. విజయనగరం పట్టణంలోని సంజీవయ్య అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత, పౌష్టికాహార లోపం బారిన పడకుండా ఉండొచ్చన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాధాకుమారి, ఉష, పార్వతి, ప్రణయ తదితరులు పాల్గొన్నారు. - విజయనగరం ఫోర్ట్

• ఆటో కార్మికుల నిరసన



ఆటో కార్మికులపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని శ్రీవిజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావు డిమాండ్ చేశారు. విజయనగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పోలీసుల వేధింపులను నిరసిస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలో నాలుగు వేల ఆటోలు తిరుగుతున్నాయని 2007లో ఆర్‌టీఓ, మున్సిపల్ కమిషనర, ట్రాఫిక్ అధికారులు ఎవరికీ అంతరాయం లేకుండా ఆటో స్టాండ్‌లను కేటాయించారన్నారు. కొత్తగా విధుల్లోకి వచ్చే వారంతా ఆటో కార్మికులను వేధిస్తూ.. అపరాధ రుసుం విధిస్తున్నారన్నారు. దీనిపై డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. బాలి సన్యాసిరావు, చెన్నా ధర్మ, కందిరాము, తర్లాడ శ్రీధర్, గేదెల నారాయణరావు, ఆటోడ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - విజయనగరం టౌన్

• తంగుడుబిల్లిలో బడిబాట ర్యాలీ



నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి గ్రామంలో స్థానిక ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీను ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. హెచ్ఎమ్ రొంగలి సత్యం, గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన బోధన అందుతుందన్నారు., పిల్లల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. - నెల్లిమర్ల రూరల్

ఏమిటీ పాట్లు...!



విజయనగరం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పెద్ద సంఖ్యలో క్యూ కడుతున్నారు. అర్జీలు అందజేస్తున్నారు. అధికారులు స్వీకరిస్తున్నారు. అయితే తమ సమస్యలకు పరిష్కారం దొరికేనా... అని నిరుత్సాహం చెందుతున్నారు. ఇదే సమయంలో మండుటెండలో వచ్చే అర్జీదారులు తమ విన్నపాలు అందజేసేందుకు పాట్లు పడుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకుంటున్న అర్జీదారులు



కుర్చీల్లోనే సేద తీరుతున్న అర్జీదారులు